

జీపీల నిధులు మాయం చేశారు
కేంద్రం పంచాయతీల ఖాతాల్లో జమ చేసిన నిధులను రాత్రికి రాత్రి ప్రభుత్వం కాజేసిందని బీజేపీ నేత వెంకటరమణారెడ్డి ఆరోపించారు.
- 8లో ▸



కరెంటు కష్టాలు..
జనగామలో 52 డబుల్ బెడ్ రూం ఇళ్లకు కలిపి ఒకటే విద్యుత్ మీటర్ ఏర్పాటు చేశారు. దీంతో రూ. లక్ష బిల్లు వచ్చింది.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.4 /11.8
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'హామీల అమలులో సర్కారు విఫలం'



నిజాంసాగర్(జుక్కల్): ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇచ్చి తిరిగి గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ వాటి అమలులో విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆరోపించారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు, పోడు భూముల పట్టాలు, ఆసరా పింఛన్లు మంజూరు చేయకుండా ప్రజలకు మోసం చేశారన్నారు. శనివారం నిజాంసాగర్ మండలంలోని కొమలంచ, సింగితం గ్రామాల్లోని శక్తి కేంద్రాల్లో ప్రజాగోస-బీజేపీ భరోసా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రెండుసార్లు సీఎం అయినా పేదవారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించలేకపోయారన్నారు. ఇంటి స్థలం ఉంటే ఇల్లు నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామన్న హామీ గాలిలో కలిసిపోయిందన్నారు. తాత, ముత్తాల కాలం నుంచి పంటలు సాగు చేసుకుంటున్న పలువురు రైతులకు పట్టా, పాస్ బుక్కులు ఇవ్వకపోవడంతో రైతుబంధు, రైతుబీమాకు దూరం అయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు మురళీయాదవ్, రాములు సేట్, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్‌అర్బన్: టీచర్ల బదిలీలకు సంబంధించి నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. కొత్తగా స్పౌజ్ టీచర్లకు పాత జిల్లా సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని కొత్త ఉత్తర్వులు రావడంతో మళ్లీ దరఖాస్తులు తీసుకొని ప్రక్రియను చేపడుతున్నారు.

15 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 15 తేది నుంచి నిర్వహిస్తున్నట్లు డీఐఈవో రఘురాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు మార్చి 2 తేది వరకు కొనసాగుతాయన్నారు. పరీక్షలు మూడు దశల్లో జరుగుతాయన్నారు. ఈనెల 15 నుంచి 20 వరకు మొదటి దశ, 21 నుంచి 25 వరకు రెండో దశ, 26 నుంచి మార్చి 2 వరకు మూడో దశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ కోసం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక, కేజీబీవీ, గిరిజన, మోడల్, మైనారిటీ కళాశాలలు తమ లాగిన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. జిల్లాలో జనరల్ విద్యార్థులు 19,744 మంది ఉండగా 70 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకేషనల్‌కు ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

అమెరికా అమ్మాయితో మాక్లూర్ అబ్బాయి నిశ్చితార్థం



మాక్లూర్: అమెరికా అమ్మాయి, మాక్లూర్ అబ్బాయి వివాహ నిశ్చితార్థం శనివారం వరుడి గృహం మాక్లూర్‌లో ఘనంగా జరిగింది. నిశ్చితార్థానికి జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు ప్రముఖులు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. మాక్లూర్ సొసైటీ మాజీ చైర్మన్ రమణరావు కుమారుడు వినీశ్ రావు ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటాడు. అక్కడి అమ్మాయి డాక్టర్ బ్రిజేరో లూన ప్రేమలో పడ్డాడు. వీరిద్దరు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు అంగీకరించారు. వెంటనే అమ్మాయి తల్లిదండ్రులను అమెరికా నుంచి రప్పించి నిశ్చితార్థం జరిపించారు. ఇక్కడి సంస్కృతికి ఆకర్షితులైన వారు హిందూ సంప్రదాయ దుస్తులను ధరించారు.

అరెస్టులు అన్యాయం

బోధన్: ఎన్డీఎస్ఎల్ కార్మికుల ముందస్తు అరెస్టులు అన్యాయమని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘాల నాయకులు శనివారం అసెంబ్లీ వద్దకు వెళ్తామని ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పలువురు కార్మికులను అదుపులోకి తీసుకుని స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. శని వారం సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

చలనచిత్ర రంగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు తమదైన ముద్ర వేశారు. నటులుగా, హాస్య నటులుగా, గాయకులుగా, దర్శక నిర్మాతలుగా గుర్తింపు పొందారు. నిర్మాతలుగా డి.ప్రభాకర్, దిల్ రాజు, నటులు, హాస్యనటులుగా నితిన్, అదితి, శ్రీముఖి, వెన్నెల కిషోర్, చమ్మక్‌చంద్ర.. ఇలా ఎందరో తెలుగు సినీ జగత్తులో సత్తా చాటి జిల్లాకు పేరు తెచ్చారు. సినిమాలలో సత్తా చాటుతున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులపై సండే స్పెషల్..

– సాక్షి, కామారెడ్డి

వెండితెరపై మన తారలు

- సినీ రంగంపై తమదైన ముద్ర వేసిన ఉమ్మడి జిల్లావాసులు
- నిర్మాతగా రాణిస్తున్న దిల్ రాజు
- నటుడిగా ప్రత్యేకత చాటుకున్న నితిన్
- నటీమణులుగా మెప్పిస్తున్న శ్రీముఖి, అదితి
- నవ్విస్తూ ప్రేక్షకుల అభిమానం పొందుతున్న వెన్నెల కిషోర్, చమ్మక్ చంద్ర
- '24 ఫ్రేమ్స్'లో మెరుస్తున్న మరెందరో..







సండే స్పెషల్

యాంకర్ నుంచి యాక్టర్ దాకా..

నిజామాబాద్ నగరానికి చెందిన శ్రీముఖి యాంకర్‌గా గుర్తింపు పొందారు. సినిమా, టీవీ ప్రోగ్రాములకు యాంకర్‌గా పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదిగిన ఆమె.. సినిమాల్లోనూ రాణిస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లో ఉండడంతో అప్పుడప్పుడు నిజామాబాద్ వచ్చి వెళ్తుంటుంది.

నవ్వుల రారాజు వెన్నెల కిషోర్



కామారెడ్డికి చెందిన కిషోర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో పనిచేశారు. అప్పట్లో వెన్నెల సినిమాలో నటించే అవకాశం రావడంతో ఆయన సినీరంగం వైపు మళ్లారు. వెన్నెల సినిమాలో నటించడంతో ఆయన పేరు వెన్నెల కిషోర్‌గా మారిపోయింది. హాస్యనటుడిగా కిషోర్ ఎంతో పేరు సంపాదించారు. ప్రస్తుతం దాదాపు అన్ని సినిమాల్లోనూ కిషోర్ పాత్ర ఉంటుండడం విశేషం. ఉత్తమ హాస్యనటుడిగా ఆయన నంది పురస్కారం కూడా అందుకున్నారు. అప్పుడప్పుడూ కామారెడ్డికి వచ్చి తన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులని కలిసి వెళ్తుంటారు.

దిల్ రాజు..



నిజామాబాద్ నగరానికి సమీపంలోని నర్సింగ్‌పల్లికి చెందిన దిల్ రాజు.. నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా సినీ ఇండస్ట్రీని శాసిస్తున్నారు. ఆయన ప్రముఖ నటీనటులందరితో ఎన్నో సినిమాలు తీశారు. ఆయన సొంతూరులో ఇందూరు తిరుమల పేరుతో భారీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. నిర్మాతగా ఎందరినో సినిమా రంగంలోకి తీసుకువచ్చారు.

నటీమణిగా ఎదుగుతున్న అదితి..

కామారెడ్డి పట్టణానికి చెందిన అదితి మ్యాకాల్.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఆమె తండ్రి రాంచంద్రం హైదరాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆమె అర్జున్‌రెడ్డి, జంటిల్‌మెన్, అమీతుమీ, షాదీ ముబారక్‌వంటి సినిమాల్లో నటించింది. అలాగే పాష్ పోరీస్, మాయాబజార్ వంటి వెబ్‌సిరీస్‌లలోనూ నటిస్తోంది. నటనతో పాటు కూచిపూడి నృత్యంలోనూ ఆమె రాణిస్తోంది.

హాస్యం పండించే చమ్మక్ చంద్ర



గాంధారి మండలం వెంకటాపూర్‌కు చెందిన గిరిజన బిడ్డ చమ్మక్ చంద్ర.. తన నటనతో హాస్యం పండిస్తూ అందరినీ మెప్పిస్తున్నారు. టీవీ చానళ్లలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని గుర్తింపు పొందారు. సినిమాల్లోనూ హాస్య నటుడిగా రాణిస్తున్నారు. ఆయన తరచూ సొంతూరుకు వచ్చి వెళ్తుంటారు. వచ్చినప్పుడల్లా అందరినీ కడుపుబ్బా నవ్విస్తుంటారు.

సినీ గాయకుడిగా విష్ణుకిషోర్



ఆర్మూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన విష్ణుకిషోర్ జానపద గాయకుడిగా తన ప్రస్థానం మొదలుపెట్టి సినీ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా ఎదిగారు. సినిమాల్లోనూ నటిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమ గీతాలు పాడిన విష్ణుకిషోర్.. ఉమ్మడి జిల్లాలో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీకేఆర్ స్టూడియోను స్థాపించారు. మ్యూజిక్ డైరెక్టర్‌గానూ రాణిస్తున్నారు.

భగవాన్ సినిమా నిర్మాత ప్రభాకర్



కామారెడ్డి పట్టణానికి చెందిన నిర్మాత దివంగత డి.ప్రభాకర్ ప్రియా ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రెబల్ స్టార్ కృష్ణంరాజు హీరోగా భగవాన్ సినిమాను నిర్మించారు. అప్పట్లో అది సూపర్‌హిట్ అయ్యింది. ఆ తర్వాత ఆయన నాయకురాలు, ప్లీజ్ నాకు పెళ్లయ్యింది వంటి సినిమాలకు ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. అలాగే డిస్ట్రిబ్యూటర్‌గానూ పనిచేశారు. కామారెడ్డిలో ఆయన స్థాపించిన ప్రియా థియేటర్లు రెండు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కామారెడ్డి మున్సిపల్ కాకముందు ఆయన సర్పంచ్‌గానూ సేవలందించారు.

నిర్మాతగా రజిత్‌రావ్ అడుగులు..



ఆర్మూర్‌కు చెందిన వ్యాపారవేత్త బల్గూరి రజిత్‌రావ్ సినీ రంగంలో అడుగుపెట్టారు. ఇటీవల 'అన్‌స్టాపబుల్' చిత్రాన్ని నిర్మించారు. చిన్ననాటి నుంచి సినిమాల మీద ఉన్న మోజుతో ఆయన సినీ నిర్మాణ రంగంలో అడుగుపెట్టి గుర్తింపు పొందారు. సినీ, రాజకీయ రంగ పెద్దలతో సన్నిహిత సంబంధాలున్న రజిత్‌రావ్.. నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

గేయ రచయితగా రుద్రంగి రమేశ్



మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రుద్రంగి రమేశ్ అనేక సినిమాలకు పాటలు రాశారు. మాస్ పవర్, పోలీస్ పవర్, పోరాటం, మిస్టర్ ఐటం, సినిమా సినిమా, ప్రేమిస్తే చంపేస్తారా, నైజాం సర్కరోడా, రుద్రనాగు, హృదయం, దిల్లున్నోడు, నువ్వంటే ఇష్టం వంటి సినిమాలకు పాటలు రాశారు. అలాగే భక్తి గీతాలు కూడా ఎన్నో రచించారు.

టాప్ హీరోగా గుర్తింపు పొందిన నితిన్..



నిజామాబాద్‌కు చెందిన సినీ హీరో నితిన్ తొలి సినిమా 'జయం'తోనే ప్రేక్షకులను మెప్పించారు. తన నటనతో ఇండస్ట్రీలో టాప్ స్టార్లలో ఒకరిగా ఎదిగారు. నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డి ప్రొడ్యూసర్‌గా కొనసాగుతున్నారు. అలాగే ప్రముఖ నిర్మాత దిల్‌రాజుకు నితిన్ దగ్గరి బంధువు. నితిన్ బంధువులు చాలా మంది నిజామాబాద్‌లోనే ఉన్నారు.

రోడ్డు విస్తరణపై తగ్గేదెలె!

- అడ్డుకుంటున్న బాధితులు
- పట్టణాభివృద్ధే ధ్యేయం అంటున్న సర్పంచ్
- భిక్కనూరులో కొనసాగుతున్న నిర్మాణాల కూల్చివేతలు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన నేతలు

భిక్కనూరు: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనులను అడ్డుకోవడానికి కొందరు యత్నించగా.. తగ్గేదేలె అంటూ పంచాయతీ పాలకవర్గం ముందుకు సాగుతోంది. భిక్కనూరులో గ్రామ సభ తీర్మానం మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పాత జాతీయ రహదారి పక్కన ఇరువైపులా 55 ఫీట్ల వరకు ఉన్న కట్టడాలను కూల్చి వేస్తున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు వింజో చైర్మన్ గంగళ్ల భూమయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ బోండ్ల రాంచంద్రం, వార్డు సభ్యురాలు బోండ్ల లావణ్య, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బోండ్ల శేఖర్‌లతో పాటు కొందరు శనివారం కూల్చివేతలను అడ్డుకోవడానికి యత్నించారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అమెరికా పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చేంతవరకు ఆగాలని కోరారు. అయితే సర్పంచ్ తున్కి వేణు ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ బోడ నరేశ్, ఈవో సదాశివతో పాటు పంచాయతీ పాలక వర్గ సభ్యులు పోలీసు భద్రత మధ్య రోడ్డు వెడల్పు పనులు కొనసాగించారు. బీఆర్ఎస్ నేతలు పనులను అడ్డుకునేందుకు యత్నించగా సీఐ తిరుపయ్య ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసులు వారిని పక్కకు తప్పించారు. రోడ్డు పనులను అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. భిక్కనూరు పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని, ప్రజల అభీష్టం మేరకే రోడ్డు విస్తరణ చేపట్టామని సర్పంచ్ వేణు తెలిపారు. అక్రమ కట్టడాలను నిబంధనల మేరకే కూల్చివేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కాగా రోడ్డు విస్తరణను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు ఎంత ఒత్తిడి తెస్తున్నా వెనక్కి తగ్గని సర్పంచ్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు వర్గాలుగా బీఆర్ఎస్..

మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనుల విషయంలో బీఆర్ఎస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. పాత జాతీయ రహదారికి ఇరువైపులా పలువురు బీఆర్ఎస్ నేతల ఇళ్లు ఉన్నాయి. వారు తమ ఇళ్లను కోల్పోవాల్సి రావడంతో ఇబ్బందిపడుతున్నారు. మరో వర్గం రోడ్డు విస్తరణ పనులకు మద్దతుగా నిలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేత గజ్జె సురేశ్ తన ఇంటి నుంచే రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించాలని కోరడమే కాకుండా.. తన ఇంటి ప్రహరీని, ముందటి గదిలో కొంత భాగాన్ని కూల్చివేయించారు. చాలామంది ఆయన నిర్ణయాన్ని హర్షిస్తున్నారు. పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరుతున్నారు.

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, చిత్రంలో జిల్లా జడ్జి శ్రీదేవి, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- కేసులకు సత్వర పరిష్కారం
- జిల్లా జడ్జి శ్రీదేవి, కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్‌లతో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి శ్రీదేవి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులలో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించారు. జిల్లాలో 2,872 కేసులను పరిష్కరించారు. జిల్లాకోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలు, కుటుంబ సభ్యుల సమస్యలు, సివిల్, ఇన్సూరెన్సు, క్రిమినల్ తదితర కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ అభినందించారు. కక్షిదారులు తమ సమస్యల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ముందుగా రాజీ కేసులు గుర్తించి వారికి సమాచారం ఇచ్చామన్నారు. జిల్లాలో మొత్తం 2,872 కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ కేసులు 2,786, సివిల్ కేసులు 35, పీఎల్‌సీ కేసులు 51 ఉన్నాయి.

మనస్పర్థలు తొలగించి..

విడిపోవడానికి సిద్ధపడిన ఓ జంటను లోక్ అదాలత్ కార్యక్రమం తిరిగి ఒక్కటి చేసింది. న్యాయమూర్తులు భార్యాభర్తలను కలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన వర్కల్ సురేష్‌పై ఆయన భార్య రాజశ్రీ ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో వరకట్నం, వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసు శనివారం లోక్ అదాలత్ ముందుకు వచ్చింది. న్యాయమూర్తులు ఇరువురితో మాట్లాడి రాజీ కుదిర్చారు. దీంతో భార్యాభర్తలు సమక్షంలో ఒక్కటయ్యారు. న్యాయమూర్తి శ్రీదేవి వీరికి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు డి.కిరణ్‌కుమార్, లాల్‌సింగ్ శ్రీనివాస్, డి.వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైద్య అమృత్‌రావు, న్యాయవాదులు సిద్దిరాములు, లక్ష్మీనర్సింహారెడ్డి, రమేశ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ ద్వారా తిరిగి ఒక్కటైన జంటను అభినందిస్తున్న న్యాయమూర్తులు

'ఆఖరి మజిలీ' అవస్థలు తీరుస్తాం

- మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చిస్తాం
- చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో కామారెడ్డి పట్టణంలోని వైకుంఠధామాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి తెలిపారు. పేదలపై అంత్యక్రియల భారాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంత్యక్రియల ఖర్చులు గణనీయంగా పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారన్న విషయమై 'సాక్షి' శనివారం ప్రచురించిన కథనంపై ఆమె స్పందించారు. పట్టణంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం వారి కుటుంబాలు ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతుండడం బాధిస్తోందన్నారు. పేదలపై అంత్యక్రియల భారం తగ్గించే విషయమై మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

స్టీల్ పాడెలు సమకూరుస్తాం...

మృతదేహాలను మోయడానికి కట్టెల పాడెకు ఎక్కువ ఖర్చవుతున్నందున మూడు స్టీల్ పాడెలు తయారు చేయించి వైకుంఠధామానికి అందిస్తామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథుల మహేశ్‌గుప్తా, పట్టణ ఆర్యవైశ్య సంఘం నిర్వహణ కార్యదర్శి గరిపల్లి శ్రీధర్ గుప్తా తెలిపారు. వారు శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. అంత్యక్రియల ఖర్చులు పెరగడంతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తమ వంతుగా స్టీల్ పాడెలు తయారు చేయించి వైకుంఠధామాలకు అందిస్తామని పేర్కొన్నారు.

పరిపాలన సౌలభ్యం కోసమే..

కొత్త మండలాల ఏర్పాటు
- కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ
- సాలూర మండల ప్రారంభంలో ఎమ్మెల్యే షకీల్



సాలూరలో తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షకీల్, ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ సావిత్రి

బోధన్‌రూరల్: పరిపాలన సౌలభ్యం, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కొత్త మండలాలు ఏర్పాటు చేస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నారు. బోధన్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన సాలూర మండలాన్ని శనివారం ఎమ్మెల్యే షకీల్, ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ చంద్రకళ, ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. సాలూర మండలం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సాలూరలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభుత్వ సేవలు, కార్యక్రమాలను ఎమ్మెల్యే షకీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గంలో మంజీర తీరం ప్రాంతల గ్రామాల ఆకాంక్ష మేరకు సాలూర మండలాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. సాలూర మండల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు, నాయకులకు ప్రజలకు ధాన్యవాదలు తెలిపారు. చిన్న మండలాలతో గ్రామాలకు అత్యధికంగా నిధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సాలూర మండలం అభివృద్ధికి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, తహసీల్దార్ వరప్రసాద్, , మమత, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఏకచక్రేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.కోటి



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్‌టౌన్: బోధన్‌లోని ఏకచక్రేశ్వర ఆలయ అభివృద్ధికి కోటి రూపాయాలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ పేర్కొన్నారు. శనివారం ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారణ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్‌తో పాటు పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ పటేల్, ఈరపురం పోషెట్టి, మాషెట్టి నర్సయ్య, శ్యామ్, జెల్ల నారాయణ, మాధవిలకు నియామక పత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. శివాలయం అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తామన్నారు. అనంతరం శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ ఈవో రవీందర్‌గుప్తా, ప్రధాన అర్చకులు గణేష్ మహారాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, రవీందర్ యాదవ్, ఆర్డీవో రాజేశ్వర్, ఏసీపీ కిరణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, కౌన్సిలర్‌లు దూప్‌సింగ్, గంగారాం, ఇమ్రాన్, శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

జీపీల నిధులు మాయం చేసిన ప్రభుత్వం

- బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

కామారెడ్డిటౌన్: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసిన డబ్బును రాత్రికి రాత్రి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం మాయం చేసిందని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ప్రజా గోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో భాగంగా శనివారం కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి, కొటాల్ పల్లి, లింగాయపల్లి, తిమ్మక్‌పల్లి, ఉగ్రవాయి గ్రామాలతో పాటు పట్టణ పరిధిలోని క్యాసంపల్లి, సరంపల్లిలో కార్యక్రమాలను నిర్వహించారు. బీజేపీ జెండాలను ఆవిష్కరించి ఆయన ప్రజలతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అప్పు చేస్తే గానీ ప్రభుత్వానికి నెల గడిచే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సర్పంచుల ఖాతాల్లో 14వ ఆర్థిక సంఘం కింద గ్రామాల అభివృద్ధి కోసం జమ చేసిన డబ్బును రాత్రికి రాత్రి మాయం చేసిన వారు మేమే అభివృద్ధి చేస్తున్నాం అనడం సిగ్గు చేటు అని విమర్శించారు.



సరంపల్లిలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

రాజంపేట: మండలంలోని పొందూర్తి, తలమడ్ల, ఆరెపల్లి, శివాయిపల్లి, రాజంపేట గ్రామాలలో ప్రజా గోస భరోసాలో భాగంగా కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి మాట్లాడారు. తుపాకీ రాముడి పాలన కావాలా? శ్రీరాముడి పాలన కావాలని అని ప్రశ్నించారు. మహిళలకు స్త్రీనిధి, పావలా వడ్డీ రుణాలు ఇచ్చేవరకు ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో గంగారెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీను, మనోహర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

తెయూలో క్విజ్ పోటీలు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆర్ విగ్నేష్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ 4వ మహాసభలను పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. విగ్నేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ నోటిఫికేషన్స్ విడుదల చేసింది కానీ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రత్యేకంగా కోచింగ్ ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. ఈ క్విజ్ పోటీలలో ఎంకామర్స్ విద్యార్థులు శ్యామ్, యాదగిరి, గోపాల్ ప్రథమ బహుమతి, లా విద్యార్థులు అంజి, మహేష్, మస్తాన్ ద్వితీయ బహుమతి సాధించినట్లు క్విజ్ మాస్టర్ రాజేందర్ తెలిపారు. విజేతలకు ఫిబ్రవరి 16న క్యాంపస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రైజ్ మనీ అందిస్తారని విగ్నేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు సాయిప్రసాద్, ప్రసాద్, సంధ్యారెడ్డి పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో పాల్గొన్న తెయూ విద్యార్థులు

క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుంది



క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్

పెర్కిట్: క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో శనివారం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 41వ రాష్ట్ర స్థాయి బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మానస గణేష్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంత్ రెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ రావు, రవీందర్ గౌడ్, వీరభద్ర రావు, దుర్గయ్య, రాజేశ్వర్, కృష్ణ మూర్తి, పీఈటీలు సురేందర్, నాగేష్, సురేష్, మాధురి, భాగ్య పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో పోలీస్ కళాజాత

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో శనివారం పోలీస్ కళాజాత కార్యక్రమం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మూఢ నమ్మకాలు, ఆన్‌లైన్ మోసాలను కళ్లకు కట్టినట్లు బృంద సభ్యులు నాటకంగా ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదాలు, మద్యం సేవించి వాహనాన్ని నడిపితే జరిగే నష్టాలను వివరించారు. ఎస్సై రాజశేఖర్, సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ విక్రమ్, ఎంపీటీసీ జ్యోతి, వీడీసీ అధ్యక్షుడు ముఖేష్, మహేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

ఎర్రజొన్నకు రోజుకో ధర!

- సిండికేట్ అయి తగ్గిస్తున్న వ్యాపారులు
- ఆందోళనలో రైతులు

బాల్కొండ: జొన్న పంటకు నిలకడ లేని ధర ప్రకటిస్తు వ్యాపారులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ ఏడాది ఎర్ర జొన్న సాగు విస్తీర్ణం తగ్గడంతో క్వింటాలుకు రూ.5 వేల వరకు ధర ఉంటుందని రైతులు ఆశించారు. అనకున్నట్లుగానే మొదట్లో క్వింటాలుకు రూ.4400 వరకు పలికింది. వారం రోజులు గడువక ముందే క్వింటాలుకు రూ.4200, కొన్ని గ్రామాల్లో రూ.3800 అంటు వ్యాపారులు ప్రకటనలు చేస్తున్నారు. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడుతున్నారు. జొన్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్‌లో ధర తగ్గించుటకు అప్పుడే కుట్రలు మొదలెట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జొన్న పంటల కోతలు చివరి నాటికి మరింత ధర తగ్గిస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రజొన్న పంట వాణిజ్య పంట కావడంతో విత్తనాలను జొన్న వ్యాపారులే సరఫరా చేస్తారు. పంట దిగుబడిని కూడా విత్తనాలు సరఫరా చేసిన వ్యాపారులే కొనుగోలు చేసేల ముందే ఒప్పందం ఉంటుంది. కానీ కొన్నేళ్లుగా విత్తనాలు సరఫరా చేసే వ్యాపారులు కాకుండా ఎవరైన కొనుగోలు చేసేలా రైతులు ఒప్పందాలను చేసుకుంటున్నారు. అయిన వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను రోజు రోజుకు తగ్గిస్తున్నారు. విత్తనాలు సరఫరా చేసిన



వ్యాపారే కొనుగోలు చేయాలని గతంలో ఒప్పందం చేసుకుంటే విత్తన వ్యాపారి ఇచ్చిన ధరనే దక్కేది.

అలా అని వేరే వాళ్లు కొనుగోలు చేసేల ఒప్పందం చేసుకున్నా.. వ్యాపారుల సిండికేట్ అయి ధర తగ్గిస్తున్నారు. ఇలా ప్రతి ఏటా జొన్న పంటతో ఏడుపే మిగులుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఒకసారి ప్రభుత్వం కొనుగోలు

జొన్న రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం క్వింటాలుకు రూ.2300కు కొనుగోలు చేసింది. కానీ వ్యాపారులు కొనుగోలు చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే క్వింటాలుకు రూ.100 తగ్గించి వ్యాపారులు కూడా కొనుగోలు చేశారు. తర్వాత ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. కానీ బై బ్యాక్ ఒప్పందాలు చేసుకోవాలని వ్యవసాయ అధికారులతో అవగాహన సమావేశాలను నిర్వహించింది. ప్రస్తుతం వ్యాపారులు సిండికేట్ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని రైతులు కోరుతున్నారు.

రోజుకొక ధర చెబుతున్నారు



జొన్న పంటకు రోజుకొక ధర చెబుతున్నారు. ఇలా రోజు రోజుకు ధరను తగ్గించుటకు వ్యాపారులు కుట్రలు చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం జొన్న విస్తీర్ణం అంతగా లేకున్న ధరను తగ్గిస్తున్నారు.

– సామ రవి, రైతు

ఏటా ఇదే లొల్లి



జొన్న పంట సాగు చేస్తే ఏటా ఇదే లొల్లి అవుతుంది. వ్యాపారులు అందరు ఒక్కటై ధరకు తగ్గిస్తున్నారు. ఫలితంగా రైతులకు నష్టం వాటిల్లుతోంది. జొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాకేశ్‌రెడ్డి, రైతు

క్షుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి సీట్ల భర్తీకి ప్రవేశ ప్రకటన వెలువడిందని సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ బి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుచున్న విద్యార్థులు ఇందుకు అర్హులని, మార్చి 6వ తేదీలోగా రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతులలో ఖాళీ సీట్ల (బ్యాక్‌లాగ్) భర్తీకి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ సంగీత తెలిపారు. బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్లకు మార్చి 7 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 4, 6, 7, 8, 9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల అభ్యర్థులకు ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ www. tswreis. ac. in ను సందర్శించాలని సూచించారు.

డీఎస్సీ 2003 టీచర్లకు ఓపీఎస్ అమలు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీ 2003 టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయ్యాలని డీఎస్సీ 2003 టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ డిమాండ్ చేశాడు. శనివారం కేర్ డిగ్రీ కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి ఉమ్మడి ప్రభుత్వం నియామక ప్రక్రియ ఆలస్యం చేయడంతో కొత్త పెన్షన్ విధానం వర్తిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్, రవీందర్, సురేందర్, స్వప్న, పావని, భవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మాక్లూర్: మండలంలోని శ్రీ అపురూప వేంకటేశ్వర ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. శనివారం చక్రతీర్థం ఘనంగా నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభంపై నుంచి ధ్వజారోహన్ని దించి ఉత్సవాలు ముగించారు. ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రభ, వసంత, రమణరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. నగరంలో శంకర్ భవన్, మాణిక్‌భవన్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 626 మంది అభ్యర్థులకు 267 మంది పరీక్షకు హాజరయ్యారు. డ్రాయింగ్ లోయర్, హయ్యరు, టైలరింగ్ లోయర్‌లో పరీక్షలు నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఏసీపీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్సై పూర్ణేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ వెంట టౌన్ సీఐ వెంకట నారాయణ ఉన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER
- పర్మినెంట్ బిజినెస్ వన్‌టైమ్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజీ లీడింగ్ మల్టీ బిజినెస్ డైలీ సపోర్టు + ట్రైనింగ్ + మంచి భవిష్యత్తు + ఆదాయం + 15 సం॥ల అనుభవం. ఫోన్: 9908743603 [HA-5600]

REAL ESTATE

PLOT FOR SALE
- Plot For Sale: in Arya Nagar Layout Colony, West face 234 sq yard (38.6x54.6), can be devide in 2 plots 117sq yard (19.3x54.6), 50 mts to Hyderabad road, NZB. Contact: 9963087337, 9908993063 [G-5971]
- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం – జనహర్ష డ్రీమ్ సిటీ – 1 & 2 లోని ప్లాట్లు అమ్మబడును. మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345. [H-793508]

HOUSE FOR SALE
- Subhashnagar Near SBI Old House in 267syd 64L Brokers Excuse. Cell: 9440330931. [HA-9203]

WANTED
- ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు వేయిటర్స్ కావలెను. జీతం: 15,000/18,000 + రూం ఫ్రీ, భోజనం. తెలంగాణ వంటలు చేసే అనుభవం ఉన్నవారికి జీతం: 20,000/25,000 ఇవ్వబడును. ఫోన్ నెం. 96522 51167. [Z-0992751]
- వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 18000+రూం + భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816. [WA-6477]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779895]
- విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7036731248. [M-1190573]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792805]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డి యువకుడి మృతి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన యువకుడు దహగం ప్రకాశ్ (35) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు శనివారం తెలిపారు. వివరాలు.. ప్రకాశ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి నల్గొండ జిల్లా నుంచి బంధువుల వివాహానికి హాజరై హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలం ధర్మాపురం శివారులో కారు చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రకాశ్ ఘటన స్థలంలోనే మృతి చెందగా కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకర్ బోల్తా



బాన్సువాడ రూరల్: బాన్సువాడ –బీర్కూర్ ప్రధాన రహదారిపై కొల్లూర్ వాగు సమీపంలో శనివారం సెప్టిక్‌ట్యాంక్ వాహనం బోల్తా పడింది. బాన్సువాడ నుంచి బీర్కూర్‌కు అతివేగంగా వెళ్తున్న సెప్టిక్‌ట్యాంకర్ అదుపు తప్పి పంట పొలంలో పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

నంబర్ ప్లేట్ మార్చిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో నంబర్ ప్లేట్ మార్చిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్ తనిఖీలు చేయగా అఫ్రోజ్ తన ఆటోకు టీఎస్16 యూబీ 3341 బదులుగా టీఎస్16యూబీ 3241 నంబర్ ప్లేట్ పెట్టుకొని ఆటోను నడుపుతుండడంతో ట్రాఫిక్ పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తప్పుడు నంబర్ ప్లేట్ పెట్టిన వారిపై ఎంవీఐ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెల్ టవర్ బ్యాటరీ చోరీ

ఎల్లారెడ్డి: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో సెల్ టవర్ నుంచి బ్యాటరీలను దొంగలు ఎత్తుకుపోయినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామ శివారులో గల టవర్ నుంచి దొంగలు శనివారం వేకువ జామున బ్యాటరీలను చోరీ చేశారు. సెల్ టవర్ వద్ద చోరీకి గురైన ప్రాంతాన్ని ఎస్సై గణేష్ పరిశీలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపినందుకు కామారెడ్డి కోర్టు ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేటకు చెందిన లక్ష్మణ్ ఈనెల 7న దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని శనివారం కోర్టులో హాజరు పర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

రుద్రూర్: రుద్రూర్ ఎంపీపీ భర్త, బీఆర్ఎస్ మండల నాయకుడు అక్కపల్లి నాగేందర్‌పై శనివారం రిపోర్టర్లు అశోక్ కాంబ్లె, తాటిపాముల రాజశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఫోన్‌లో తమను బెదిరించడంతో పాటు కులం పేరుతో దూషించాడని వారు ఆరోపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పసుపు రైతులకు న్యాయం చేయాలి



మార్కెట్ యార్డును సందర్శించిన పసుపు రైతు సంఘం నాయకులు

ఇందూరు: పసుపు పంట ధర రోజురోజుకు పడిపోతుందని, దీనిపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించాలని తెలంగాణ పసుపు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులతో మాట్లాడి ధరలను తెలుసుకున్నారు. రైతు నాయకులు మాట్లాడుతూ... పసుపునకు మద్దతు ధర, పసుపు బోర్డు తేవడంలో ఎంపీ అర్వింద్ విఫలమయ్యారని విమర్శించారు. గత రెండేళ్ల క్రితం పసుపునకు మంచి ధర రాగానే తన వల్లే వచ్చిందని, వ్యాగన్ల ద్వారా బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసుకున్నామని చెప్పిన అర్వింద్ ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం మీద ఆధారపడకుండా మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలుకు రూ.10వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు, నవీన్ రెడ్డి, చిన్నారెడ్డి ఉన్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

నిజామాబాద్ సిటీ: పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలని జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌టీపీ నాయకుడు తిరుపతిరెడ్డి కోరారు. అనంతరం ఈ మేరకు మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

డిచ్‌పల్లి: రెండు రోజులుగా తీవ్రంగా వెదుకులాట జరిపిన తర్వాత ఎట్టకేలకు చెరువులో నుంచి నల్లవెల్లి మహిపాల్ (34) మృతదేహం శనివారం బయట పడింది. గురువారం మధ్యాహ్నం చెరువులో స్నానం చేయడానికి దిగి నీటిలో గల్లంతైన మహిపాల్ ఆచూకీ కోసం రెవెన్యూ, పోలీసు అధికారులు, గ్రామస్తులు రెండు రోజులుగా తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి గ్రామానికి చెందిన మహిపాల్ గురువారం తన భార్య సుమలత, తల్లి గంగమణితో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. వారిద్దరు బట్టలు ఉతుకుండగా మహిపాల్ స్నానం చేసేందుకు చెరువులో దిగి ఈతకొడుతూ నీటిలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి గమనించిన సుమలత, గంగమణి ఇద్దరూ గ్రామస్తులకు విషయం తెలిపారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్థానికులు చెరువులో దిగి రాత్రి వరకు గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మరోసారి రోజంతా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి చీకటి పడినా మహిపాల్ ఆచూకీ లభించక పోవడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు శనివారం ఉదయం సాంపల్లి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లను పిలిపించారు. అప్పటికే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గజ ఈతగాళ్లు చెరువులో గాలించినా మహిపాల్ ఆచూకీ లభించలేదు. అలసిపోయిన ఈతగాళ్లు ఒడ్డుకు వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంతలో చెరువు మధ్యలో మహిపాల్ మృతదేహం పైకి తేలింది. వెంటనే ఈతగాళ్లు నీటిలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీసుకుని వచ్చారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.



మహిపాల్ (ఫైల్)